# శివా భవానీ రుద్రాణీ....

పక్క సెక్షన్‌లో గలభాగా ఉంది. ఇంకా ఆఫీసరు రాలేదు. హెడ్ క్లర్కు కూడా—చిన్నవాడే కాబట్టి మిగతా గుమాస్తాలతో చనువుగా ఉంటాడు—వాళ్ళతో చేరినట్లున్నాడు. కాసేపుంటే సద్దుమణిగి పోతుందిలే అనుకున్నాను కాని ఓ పది నిమిషా లయింతర్వాత కూడా ఇంకా అలాగే ఉంది. ఇక ఉండబట్టలేక వెళ్ళాను.

మూర్తి, శర్మా, ఆంజనేయులూ, సుబ్రహ్మణ్యం, వెంకటస్వామీ కలిసి హెడ్‌క్లర్కు సత్యనారాయణచుట్టూ చేరారు. వాళ్ళ మధ్యచేరి ఓ నిమిషం సొద ఆలకిస్తే సంగతి తెలిసింది. కొత్తగా పెళ్ళయిన శేఖర్ భార్య గురించి ఈ గోలంతా. అసలు ఎట్లా మొదలయిందంటే ఎవరూ చెప్ప లేదు. ఆఫీసులో పనిచేసే ఓ తోటి స్నేహితుడి భార్య పేరు గురించి ఇంత గొడవెందుకంటారేమో. వాళ్ళు ఆవిడ పేరు గురించి పందాలు కూడా వేసుకుంటున్నారు.

శర్మ అన్నాడు: 'శేఖర్ భార్య పేరు పార్వతి.'

'కాదు. గిరిజ' - ఆంజనేయులు ఉవాచ.

'కాదు భవాని' మూర్తి అనటం.

'కాదు. అదేమిటో తమాషా అయినపేరు ... అ .. అపర్ణ' అన్నాడు సుబ్రహ్మణ్యం.

'అదీకాదు. కనకదుర్గ అని నాకు చెప్పాడు'—వెంకటస్వామి. మరి నాకేమో లలిత అని చెప్పినట్టు జ్ఞాపకం. నేనామాట పైకనలేదు.

'శేఖరం భార్యపేరు భవాని. ఎంతెంత పందెంకి' అన్నాడు మూర్తి.

'భవాని కాదు-పార్వతి. అయిదు రూపాయలు పందెం' అన్నాడుశర్మ.

'ఏమిటోయ్! అంత ధీమా'

'కాదురా. నేనో రోజు వాళ్ళింటికి వెళ్ళితే అన్నయ్యగారూ అంటూ మర్యాద చేసింది. చాలాసేపు వాళ్ళింట్లో కూర్చున్నాను. ఓ యాభై సార్లన్నా ఆవిడ పేరు శేఖరం నోటిన విని ఉంటాను' అన్నాడు శర్మ.

'ఓయబ్బ! నేనూ వెళ్ళాను ఓ రోజు. మా చెల్లెలు తీసుకెళ్ళమంటే. మా చెలెలు పేరూ, ఆవిడ పేరూ గిరిజే ఇద్దరూ క్లాసుమేట్లుట. వాళ్ళ కాలేజీ సంగతులు కొన్ని

---

*రెండవ బహుమతి రూ. 25*

పి. ఎస్. రామకృష్ణ
(ఎమ్. టెక్, సెకండియర్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, బొంబాయి)

"చెప్పిం దావిడ" అన్నాడు ఆంజ
నేయులు.

హెడ్‌క్లార్కు సత్యనారాయణ కలగ కేసుకున్నాడు. "బాబూ ఇంత గోల ఎందుకు? అతని పెళ్ళి శుభలేఖ ఇక్కడే డ్రాయర్లో ఉండి ఉండాలి. చూద్దాం. నా మటుకు నాకు ఉమ సుందరి అని చెప్పినట్లు జ్ఞాపకం అంటూ డ్రాయర్లో వెతక సాగాడు. జనం కాస్త సద్దుమణిగారు శుభలేఖకోసం ఆత్రుతగా చూస్తున్నారు.

"ఆ! ఇదిగో కవరు" అంటూ సత్యనారాయణ కవరులోంచి శుభలేఖ తీసి బల్లమీద పెడుతుంటే టేబుల్ చుట్టూ ఉన్న మూకంతా ఒక్కుమ్మడిగా ముందుకు జరిగారు. శర్మ చేయి తగిలి ఇంక్‌పాట్ బోర్లా పడింది సరిగ్గా శుభలేఖ నిండా ఇంకు పడింది ఒకటి నిఇంకులో ఏమీ అక్షరాలు కనపడటం లేదు. వధువు పేరు పూర్తిగా కనపడకుండా పోయింది.

"ఓరి! శర్మ! ఎంత అప్రాచ్యపు పని చేశావురా" అని అందరూ అతన్ని కోప్పడ్డారు

ఉన్నట్టుండి స్వామికి ఒక బ్రెయిన్ వేవ్ వచ్చింది. మేడమీది సెక్షను కెళ్ళి శేఖర్ ఉంటే పిల్చుకు రాకూడదా అని.

మూర్తి గబగబా పైకెళ్ళాడు, ఇప్పుడే లాక్కొస్తానంటూ.

అంజనేయులుకి అనుమానం వచ్చింది. వీడు అక్కడికెళ్ళి గూడుపుఠాణీ చెయ్యడు కదా అని.

ఇంతలో ఆఫీసరు వొస్తున్నట్టు ప్యూను అభినయించాడు. ఎక్కడి వాళ్ళక్కడ సద్దుకున్నారు. ఎవళ్ళ సీట్లలో వాళ్ళు కూర్చున్నారే కాని మనసంతా పైకి వెళ్ళిన మూర్తిమీదే వుంది

అయిదు నిమిషాలలో మూర్తి తిరిగి వొచ్చాడు. ఆఫీసరు వొచ్చినట్టు గ్రహించి తన సీట్లో వెళ్ళి కూర్చున్నాడు. ఒక చిన్న కాగితం మీద ఏదో రాసి, ప్యూను కిచ్చి, అందరికీ సర్క్యులేట్ చెయ్యమని చెప్పాడు.

వీడి సస్పెన్సు! దగ్గర కొచ్చి చెప్పకూడదూ అనుకున్నా రందరూ.

ఆ కాగితం ముందు సత్యనారాయణ దగ్గరికెళ్ళి, తర్వాత శర్మ, మూర్తి చూసింతర్వాత, సుబ్రహ్మణ్యం దగ్గరికివొచ్చి అటు తర్వాత వెంకటస్వామీ, అంజనేయులూ అయింతర్వాత నా దగ్గరి కొచ్చింది. అంతసేపూ వాళ్ళందరి ముఖ కవళికలూ కని పెడుతున్నాను నేను. చూసిన వాళ్ళంతా పెదవి విరుస్తున్నారే కాని తనదే రైటయిందన్న భావం ఒక్కడి మొహంలోనూ కనబడలేదు మరి అందరిదీ తప్పయితే నాదే గా రైటు! ధీమాగా కాగితం తీసుకుని చూశాను. శేఖర్ రెండురోజులు సెలవు పెట్టాడట. ఆదివారం కలిసి వచ్చేటట్టు సోమవారం కాని రాడుట. సమస్యా పరిష్కారం సోమవారానికి వాయిదా పడింది.

సోమవారంనాడు అందరూ ఆఫీసు టైముకు కాస్తముందే వచ్చి కూర్చున్నారు. శేఖర్ మటుకు రాలేదు. మూర్తి మళ్ళా పైసెక్షనుకు వెళ్ళి కనుక్కొచ్చాడు-ఇంకో రోజు సెలవు పొడిగించాడేమోనని, కాదుట. కొద్దిగా ఆలస్యంగా వొస్తానని ఫోను చేసి పర్మిషన్ తీసుకున్నాడుట. అందరి మనస్సులూ కుదుటబడ్డాయి.

మెల్లిగా ఓ గంట ఆలస్యంగా శేఖర్ రానే వచ్చాడు. సత్యనారాయణ పిలిచి చెప్పాడు అంతా. 'అందువల్ల అడుగుతున్నాను. నీ భార్య పేరు ఏమిటి' అని. శేఖర్ నవ్వుతూ అన్నాడు. 'అబ్బో! చాలా పెదకథ ఉంది. మధ్యాహ్నం లంచ్ టైములో చెప్తాను. ఏమనుకోకండి' అని. అలా అన్నాడని సత్యనారాయణ సర్క్యులేట్ చేసిన చీటి ద్వారా మాకు తెలిసింది. మళ్ళా సస్పెన్స్. సరే మధ్యాహ్నం లంచ్ టైములో అందరమూ కాంటీన్‌లో చేరాము వెళుతుండగా నేను నెమ్మదిగా అడిగాను. 'ఏరా! లలితేనా?' అని. నువ్వు మూడొంతులు కరెక్టు అన్నాడు. ఏమిటో నాకర్థం కాలేదు.

అందరూ కూర్చున్న తర్వాత ఇలా అన్నాడు 'ఇప్పుడు ఇక్కడ ఉన్న ఏడుగురూ ఏడు పేర్లు చెప్పారు. నిజానికి అవన్నీ రైటే. అసలు మా ఆవిడకు వాళ్ళ తలిదండ్రులు పెట్టిన పేరు గిరిజాసుందరి. కొత్తలో నేనా పేరుతోనే పిలిచేవాణ్ణి ఈ మధ్య లలితా సహస్రనామ స్తోత్రం చదువుతుంటే, పార్వతికి ఎన్ని పేర్లు ఉన్నాయో తెలిసింది. అప్పట్నుంచీ ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క పేరుతో పిలిచేవాణ్ణి. అందుకనే మీకందరికీ పరిచయం చేసినప్పుడు తలో పేరూ నోటికొచ్చింది. అయితే ఇలా కూడబలుక్కుని నా రహస్యం కనుక్కుంటారనుకోలేదు'.

□□□

